క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం, ధరిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయడంతో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్‌బాబు తెలిపారు. సూరారం, ధరిపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు: ఏఓ


రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాలలో నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన మండల పరిధిలోని పీఏసీఎస్, రైతు ఆగ్రో సేవా కేంద్రం, రైతు ఉత్పత్తి కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం కేంద్రాలలో ఉన్న విత్తనాల నమూనాలను సేకరించారు. ఆగ్రో రైతు సేవా కేంద్రంలో విత్తనాలు, తదితర స్టాక్ పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం నిర్వాహకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో శనేశ్వరస్వామి జయంతి


శనేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోగల శనేశ్వరస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో స్వామి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ పంచామృతాలు, పదకొండు నదీజలాలలో అభిషేకం చేశారు. భక్తులు స్వామి వారికి తైలాభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఆరాధనోత్సవం


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గంగాయిపల్లిలో కొలువైన ఓం ఫాజిల్ నగర్ అప్పగారి ఆశ్రమంలో గురువారం అర్ధ సంవత్సర ఆరాధన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమ అప్పగారు నసీరోద్దిన్ చిష్తి (నర్సింహులు) ఆధ్వర్యంలో ఉదయం పవిత్ర పూజలతోపాటు సాయత్రం దీపాలంకరణ, ఖవాలి, భజన, పుష్పాలంకరణ చేపట్టారు. భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మేకల పెంపకం కోసం రూ.కోటి రుణం


చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

చేగుంట(తూప్రాన్): మేకల పెంపకం కోసం యూనియన్ బ్యాంక్ మంజూరు చేసిన రుణం కోటి రూపాయల చెక్కును లబ్ధిదారులకు గురువారం అందించారు. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మధుకర్ రెడ్డికి నేషనల్‌లైవ్ మిషన్ స్కాక్ పథకంలో నిబంధనల మేరకు రూ.కోటి రుణం మంజూరైంది. ఆ చెక్కును బ్రాంచి మేనేజర్ వెంకటేశం ఆయనకు అందించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రమాకాంత్, మాజీ సర్పంచ్ నాగభూషణం బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయ క్షేత్రంలో కూలీ పనులుచేసే వ్యక్తి కనిపించడంలేదని అతడి భార్య ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా టేకువాక గ్రామానికి చెందిన పచ్చిక రాము తన భార్య హేమలతతో కౌడిపల్లి మండలం ముట్రాజ్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. అక్కడే వ్యవసాయ క్షేత్రంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. హేమలత ఫోన్ చేసినా ఫలితంలేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మా కళాశాలలో చేరండి

ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోంది. అన్నివర్గాలకు, అన్నిసౌకర్యాలను కల్పించి ఉచితంగా విద్యను అందజేస్తోంది. అనుభవజ్ఞులైన లెక్చరర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి అన్ని సబ్జెక్టులను బోధిస్తున్నారు. నగరాలకు వెళ్లి అవస్థలు పడకుండా చాలా చోట్ల గ్రామాలు, మండల కేంద్రాల్లో కూడా ప్రభుత్వ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకున్న చాలా మంది విద్యార్థులు ప్రైవేట్‌కు దీటుగా ర్యాంకులు కూడా సాధిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించి మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేందుకు అధ్యాపకులు గ్రామాల బాటపట్టారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)

- అధ్యాపకుల గ్రామబాట
- ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ చదువులు
- కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన
- అనుభజ్ఞులైన అధ్యాపకులు.. సకల సౌకర్యాలు
- విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్


కరపత్రం ఇచ్చి కౌన్సిలింగ్ చేస్తున్న లెక్చరర్లు

మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన జరుగుతోంది. అన్ని సబ్జెక్టులను బోధించేందుకు పూర్తిస్థాయిలో లెక్చరర్లు ఉన్నారు. గతంలో ఈ కళాశాలలో అడ్మిషన్లు అధికంగా ఉండడంతో సీట్లు లభించడం కష్టంగా ఉండేది. ప్రస్తుతం గురుకులాలు, ప్రైవేట్ కళాశాలల పోటీతో ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. దీంతో అడ్మిషన్ల కోసం లెక్చరర్లు గ్రామాలబాట పట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్‌ఇస్తూ ప్రచారం చేస్తున్నారు.

సౌకర్యాలు..

కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన జరుగుతోంది. అలాగే సీఈసీ తెలుగు మీడియం కూడా కొనసాగుతోంది. 12 తరగతి గదులు, ప్రిన్సిపాల్‌తో సహా 11మంది రెగ్యులర్ లెక్చరర్లు, మరొక గెస్ట్ లెక్చరర్ ఉన్నారు. తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యం, పచ్చని చెట్లు, ప్రశాంత వాతావరణం ఉంది. గత ఏడాది ప్రథమ సంవత్సరంలో 171, ద్వితీయ సంవత్సరంలో 178మంది మొత్తం 359మంది విద్యార్థులు చేరారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో ఇప్పటి వరకు 23 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. దీంతో ప్రిన్సిపాల్ వెంకటరామారావు ఆధ్వర్యంలో లెక్చరర్లు శ్రీలత, మంగమ్మ, శ్రీకాంత్, గిరిధర్, సురేందర్‌రెడ్డి, దుర్గయ్య, మణికాంత్, భాస్కర్, చంద్రం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు గ్రామాలలో తిరుగుతూ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులు, విద్యార్థులకు వివరిస్తు కరప్రతాలు పంపిణీ చేస్తున్నారు.

నీట్, ఎంఎస్ కోచింగ్

కళాశాలలో అనుభం ఉన్న లెక్చరర్లతో ఉచిత విద్యాబోధన, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ చెప్పారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఎంసెట్, నీట్ కోచింగ్ ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రీ సీట్ లభిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజ్‌పల్లిలో తాగునీటికి కటకట

- వారం రోజులుగా 'భగీరథ'బంద్
- బోరుబావుల వద్ద బారులు

హవేళిఘణాపూర్(మెదక్): వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో రాజ్‌పల్లి గ్రామస్తులు తాగునీటికి కటకటలాడుతున్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న సింగిల్‌ఫేజ్ బోరుమోటార్లు కాలిపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 12 సింగిల్‌ఫేజ్ మోటార్లు ఉండగా, కేవలం ఆరు మోటార్లు మాత్రమే పని చేస్తున్నాయని వాపోయారు. ఎంపీడీఓ ఇన్‌ఛార్జిగా ఉన్న ఊరులోనే పరిస్థితి ఇలా వుంటే మిగతా పంచాయతీల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తాగునీటి ట్యాంకుకు సరఫరాచేసే మోటార్ కాలిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. చేసేదేమీ లేక మహిళలు సమీప బోరుబావుల వద్దకు వెళ్లడంతో అక్కడ కూడా క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను తీర్చాలని కోరారు.


బోరుబావి వద్ద వేచిఉన్న జనం

జొన్నల కొనుగోలు ప్రారంభం


జొన్నలను కొనుగోలు చేస్తున్న రైతులు

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): సాక్షి దినపత్రికలో 'జొన్నల కొనుగోలు బంద్' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గురువారం అల్లాదుర్గంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వారం రోజుల క్రితం రైతులు కొనుగోలు కేంద్రానికి జొన్నలు తెచ్చారు. ప్రభుత్వం ఆన్‌లైన్ నిలిపివేయడంతో పీఏసీఎస్ అధికారులు కొనుగోలును బంద్ చేశారు. రైతుల ఇబ్బందులను సాక్షి వెలుగులోకి తేవడంతో అధికారులు స్పందించి తిరిగి కొనుగోలు చేపట్టారు. మూడు రోజులపాటు రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ సీఈఓ శివగౌడ్ చెప్పారు. వ్యవసాయ అధికారులు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా పాఠశాల భవనం

- కలెక్టర్‌కు ఎంపీపీ స్వప్న వినతి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ స్వప్న

టేక్మాల్(మెదక్): మండలంలోని ఎక్లాస్‌పూర్ ప్రాథమిక పాఠశాల భవనం ప్రమాదకరంగా మారింది. నూతన భవనాన్ని మంజూరు చేయాలని ఎంపీపీ చింతా స్వప్న కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం పూర్తిగా పెచ్చులూడి వర్షం కురుస్తోందని, తాత్కాలికంగా మరమ్మతులు చేప్పటినా ఫలితం ఉండడం లేదని వాపోయారు. ప్రమాదకరంగా మారిన భవనంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని, నూతన భవనాన్ని మంజూరుచేసి వెంటనే నిర్మింపజేయాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. అనంతరం డీఈఓ రాధాకిషన్‌కు కూడా వినతి పత్రం అందించినట్లు చెప్పారు.

మట్టి ట్రాక్టర్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మట్టి ట్రాక్టర్లు

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి గురువారం తెలిపారు. మండల పరిధి ఏదుల్లాపూర్ గ్రామ పరిధిలోని సింగయ్య చెరువు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతూ శివ్వంపేటలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఫంక్షన్ హాల్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డీసీఎం బోల్తాపడి ముగ్గురికి గాయాలు


బోల్తా పడిన డీసీఎం

శివ్వంపేట(నర్సాపూర్): డీసీఎం బోల్తా పడి డ్రైవర్‌తోపాటు ఇద్దరు గాయపడ్డారు. గురువారం తూప్రాన్– నర్సాపూర్ హైవేపై ఈ ఘటన చోటుచేసుకుంది. నర్సాపూర్ నుంచి తూప్రాన్ వైపుకు కోడిఎరువు లోడుతో వెళ్తున్న డీసీఎంకు శివ్వంపేట గ్రామ శివారు వద్ద పశువులు అడ్డు రావడంతో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బ్యాతోల్‌లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను డీఎల్‌పీవో సతీశ్‌కుమార్ గురువారం పరిశీలించారు. అనంతరం నర్సరీ నిర్వహణ, పంచాయతీ రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న బడిబాట కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. వారికి ఉచితంగా భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు అందజేస్తామని, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని తల్లిదండ్రులకు వివరించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, హెచ్‌ఎం, అంగన్‌వాడీ టీచర్, ఆశావర్కర్ తదితరులు ఉన్నారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సతీశ్‌కుమార్

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సాయం


విరాళం అందిస్తున్న పంజా విజయ్ కుమార్

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు పలువురు ఆర్థిక సాయం అందజేశారు. కొందరు యువకులు అందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు విరాళాలు సేకరించారు. అందులో భాగంగా గురువారం జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ తన వంతుగా రూ.30వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మరోదాత ఆముద రాజు కూడా రూ.11,311లు అందజేశారు. దాతల సహకారంతో ఓపెన్ జిమ్‌కు అవసరమైన పరికరాలు సమకూరుస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జీపీ స్వామి, పోచయ్య, వెంకటేశం, బాబు, తిరుపతి, శెనిగపల్లి తిరుపతి, మహేశ్, వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. ఇండ్లలోకి నీరు


వర్షపునీటిని తోడుతున్న బాలమ్మ

తూప్రాన్: నైరుతి రుతుపవనాల రాకతో తూప్రాన్‌లో గురువారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రహదారి చెరువును తలపించింది. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో కురిసిన భారీ వర్షానికి గ్రామానికి చెందిన బాలమ్మ, రాణి, ఎల్లమ్మ అనే ముగ్గురు ఇండ్లలోకి వర్షపునీరు వచ్చి చేరింది. కుటుంబ సభ్యులు వర్షపునీటిని గిన్నెలు, గంపలతో బయటకు తోడుకున్నారు. వర్షానికి ఇండ్లలోని వస్తువులు తడిసిపోయినట్లు వారు పేర్కొన్నారు.


కూలిన విద్యుత్ స్తంభం

నేలకొరిగిన స్తంభాలు..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్, హవేళిఘణాపూర్ మండలాల్లో బుధవారం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని పోచమ్మరాళ్ గ్రామంలోని పొలాలకు సరఫరా అయ్యే విద్యుత్‌లైన్ తెగిపోయి కిందపడింది. విద్యుత్‌శాఖ అధికారులు గురువారం మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి, మండల నోడల్ అధికారి వెంకటేశం ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలు, గ్రామ కార్యదర్శులు, అమ్మ ఆదర్శ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడులు ప్రారంభించే నాటికి పనులు పూర్తిచేయాలని, బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామచంద్రాచారి, సుభాష్, శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటరాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా

ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో అడ్మిషన్లు

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్‌లో అడ్మిషన్లు కొనసాగుతున్నట్లు ప్రిన్సిపాల్ అవనీశ్ రెడ్డి గురువారం ఓప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తదితర గ్రూపులలో అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించండి

- ఇన్‌చార్జి ఎంపీడీఓ విఘ్నేశ్వర్


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ విఘ్నేశ్వర్

వెల్దుర్తి(తూప్రాన్): బడీడు పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఇన్‌చార్జి ఎంపీడీఓ విఘ్నేశ్వర్ పిలుపునిచ్చారు. మండలంలోని మంగళపర్తిలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను సర్కారి బడిలోనే చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులను సర్కారి బడిలోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మెహర్‌బేగం, ఉపాధ్యాయులు రామాగౌడ్, చక్రసింగ్, నరేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట షురూ..

నర్సాపూర్: మండలంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ప్రారంభమైందని ఎంఈఓ బుచ్చానాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు నిర్వహించే ఈ కార్యక్రమం 19వరకు కొనసాగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించి చిన్నారులను పాఠశాలల్లో చేర్పించడానికి కృషిచేస్తారని చెప్పారు. గత ఏడాది పదోతరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీని స్థానిక చౌరస్తాలో ఏర్పాటు చేయించామని తెలిపారు.

చేగుంట(తూప్రాన్)లో..

మండలంలోని వడియారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి పాల్గొని మాట్లాడారు. బడిబాట విజయవంతం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గియాసున్నీసాబేగం, ప్రధానోపాధ్యాయులు లీలావతి, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో..

కిష్టాపూర్ గ్రామంలో హెచ్‌ఎం లక్ష్మణ్ విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. బడిబాట ర్యాలీ నిర్వహించారు. సరిత, గ్రామ కార్యదర్శి మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు అనురాధ, అంగన్వాడీ టీచర్ మంజుల ఏఏపీసీ కమిటీ సభ్యులు నాగరాణి, కల్యాణి, అనిత, రేణుక, మంగమ్మ, లలిత పాల్గొన్నారు.

అంగన్వాడీలో చేర్పించండి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి పాల్గొని చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, అంగన్వాడీ టీచర్లు నాగరాణి, నాగమణి, మాలతి, జ్యోతిరెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే సూరారంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సాయిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్ పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్)లో..

తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాధికారి నీలకంఠం కోరారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, ఐకేపీ వీఓలతో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్, ఎంపీడీఓ లక్ష్మి, నర్సింహులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నిజాంపేట(మెదక్)లో..

నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ప్రధానోపాధ్యాయుడు ఎల్లం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల కిషన్, అంగన్వాడీ టీచర్ పద్మ, గ్రామ కార్యదర్శి మమత, మహిళా సంఘం లీడర్ హేమలత, కారోబర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్)లో..

టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లిలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు రాజేశ్వర్ రావు, శివశంకర్, సాజిద్ పాషా, పరశురాం, ఇందిర, రాధిక, పంచాయతీ సెక్రటరీ మౌనిక, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


చేగుంట(తూప్రాన్): ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు


చిన్నశంకరంపేట(మెదక్): ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు


బొడ్మట్‌పల్లిలో..